సాక్షి సిద్దిపేట

ఆదివారం । 2 । మార్చి । 2025



న్యూస్‌రీల్

రంజాన్ ఉపవాస దీక్షలు షురూ

సిద్దిపేట జోన్: నెలవంక దర్శనమివ్వడంతో రంజాన్ మాసం ప్రారంభమైంది. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు తరావీ నమాజులు (ప్రత్యేక ప్రార్థనలు) చేస్తారు. దీంతో మసీదుల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంటుంది. రంజాన్ మాసమంతా ముస్లిం బస్తీలు, వీధులు శోభాయమానంగా కనిపిస్తాయి. తెల్లవారుజామున సహర్, సాయంత్రం వేళ ఇఫ్తార్ కోలాహలం కనిపిస్తుంది. ఈ నెలంతా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు దానధర్మాలు చేస్తారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

న్యాయమూర్తి స్వాతిరెడ్డి


మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఐసీఐసీఐ బ్యాంకు సహకారంతో సిద్దిపేట కోర్టు భవనంలో సైబర్ క్రైమ్స్‌పైన శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. వ్యక్తిగత వివరాలు ఇతరులకు తెలపకూడదన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వాట్సాప్ వీడియో కాల్స్‌కు స్పందించకూడదని బ్యాంకు అధికారులకు తెలిపారు. సైబర్ క్రైమ్స్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు పోతే గంటలోపు సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మిలింద్‌కాంబ్లీ, తరణి, సిద్దిపేట ఏసీపీ మధు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.37.63 లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.37.63లక్షలు వచ్చినట్లు ఈఓ కిషన్‌రావు తెలిపారు. శనివారం ఆలయ హుండీలో భక్తులు వేసిన కానుకలు రూ.5,55,069, దర్శనం టికెట్ల ద్వారా రూ.4,01,600 వచ్చాయని తెలిపారు. జాతరలో దుకాణ సముదాయం వేలంపాట ద్వారా రూ.28,07,000 సమకూరిందని, మొత్తం రూ.37,63,669 ఆదాయం వచ్చిందని చెప్పారు. గత ఏడాది కంటే రూ.93వేల ఆదాయం ఎక్కువగా వచ్చిందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటస్వామి, కర్ర రవీందర్‌రెడ్డి, అర్చకులు సతీష్, పరమేశ్వర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం


జూమ్ కాన్ఫరెన్స్‌లో విద్యుత్‌శాఖ అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రజలకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్‌శాఖ డైరెక్టర్, జిల్లా నోడల్ అధికారి సాయిబాబా అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ సమస్య తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ చంద్రమోహన్, డివిజన్ ఇంజనీర్లు రామచంద్రయ్య, సుధీర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధకశాఖ జేడీగా అశోక్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్‌గా అశోక్‌కుమార్ శనివారం పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన జగత్‌కుమార్‌రెడ్డి పదవీవిరమణ చేయడంతో హుస్నాబాద్ ఏడీ వెంకట్‌రెడ్డి తాత్కాలిక బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ కార్యాలయం నుంచి అశోక్‌కుమార్‌ను జేడీగా నియమించగా శనివారం బాధ్యతలు చేపట్టారు.


ఇది కనిపిస్తున్నది టెంపరరీ రిజిస్ట్రేషన్ (టీఆర్)పత్రం. ఓ మహిళా రైతు పేరు మీద హుస్నాబాద్ మండల మీర్జాపూర్ ఏఈవో సంతకం ఫోర్జరీ చేసి పత్రం జారీ చేశారు. సదరు మహిళా రైతుది ఉమ్మాపూర్. అయితే ఈ గ్రామం మహ్మదాపూర్ క్లస్టర్ పరిధిలోకి వస్తుంది. సర్వే నంబర్ ఒకటి.. గ్రామం మరొకటి రాసి టీఆర్‌ను జారీ చేశారు. ఈ రైతు గత వానాకాలంలో ఎక్కువగా వరినే సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా ఫోర్జరీ సంతకాలతో పాటు, పత్తి సాగు చేయని వారి పేరు మీద తప్పుడు టీఆర్‌ల ద్వారా సీసీఐకి దళారులు పత్తిని విక్రయించారు.

పత్తి.. దళారుల కత్తి..!

పత్తి కొనుగోళ్లలో అధికారులు, దళారుల కుమ్మక్కు

- సీసీఐని బురిడీ కొట్టించిన వైనం
- 4,072 టీఆర్‌లు జారీ.. పలు చోట్ల ఏఈవోల సంతకాలు ఫోర్జరీ
- 23 సీసీఐ కేంద్రాల ద్వారా 1.20 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు
- ఇప్పటికే ఒక మార్కెట్ కార్యదర్శి, ఏవోలు సస్పెండ్
- విజిలెన్స్ విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి..


జిన్నింగ్ మిల్లులో పత్తి

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వం రైతులకు కల్పించిన వెసులుబాటును ఆసరాగా చేసుకొని కొంతమంది అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై అక్రమ దందాకు తెరలేపారు. వ్యవసాయ, మార్కెటింగ్, వ్యాపారులు కలిసి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)ని బురిడీ కొట్టించారు. దళారులు రైతుల దగ్గర తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు సీసీఐకి విక్రయించారు. అధికారులు, దళారులు కుమ్మక్కైనట్లు తెలియడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. దీంతో తీగ లాగితే డొంక కదిలినట్లు ఒక్కొక్కటిగా అక్రమాలు బయటకు వస్తున్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా 4,072 టీఆర్‌లు జారీ చేసినట్లు తెలిసింది. ఇప్పటికే ఓ మార్కెట్ కార్యదర్శి, మండల వ్యవసాయ అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు.

1.20లక్షల మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు

రైతుకు మద్దతు ధర కల్పించాలని ఉద్దేశంతో సీసీఐ ప్రతి సంవత్సరం పత్తిని కొనుగోలు చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా 23 సీసీఐ నోటిఫైడ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 12శాతం కంటే లోపు తేమ ఉన్న పత్తికి క్వింటాలుకు రూ.7,521 ధరను ప్రకటించారు. వ్యవసాయ అధికారులు క్రాప్ బుకింగ్ సమయంలో నమోదు చేయించుకున్న రైతుల వారీగా కొనుగోలు చేశారు. రైతుల ఫొటోను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. బ్యాంక్ ఖాతాలలో డబ్బులను జమ చేశారు. ఇప్పటి వరకు సీసీఐ వారు 1,20,766 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశారు.

దిగుబడికి మించి కొనుగోలు

జిల్లా వ్యాప్తంగా 1,08,050 ఎకరాల్లో పత్తిని రైతులు సాగు చేశారని వ్యవసాయ అధికారులు నిర్ధారించారు. ఒక్కో ఎకరానికి సుమారుగా 8 నుంచి 12 క్వింటాళ్ల వరకు నేల స్వాభావాన్ని బట్టి దిగుబడి వస్తుంది. పత్తి దిగుబడి సగటున 11 క్వింటాళ్లు వస్తే.. 1,18,855 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. సీసీఐ 1,20,766 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ వ్యాపారులు 15,766 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా.. మొత్తం 1,36,532 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఈ లెక్కన 16,941 మెట్రిక్ టన్నులు దిగుబడికి మించి సీసీఐ కేంద్రాలకు వచ్చిందన్నమాట.

ప్రైవేట్‌లో తక్కువగా ధర

బయట మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు దళారులు రూ5 నుంచి 6వేలకు మాత్రమే కొనుగోలు చేశారు. సీసీఐ రూ7,521 పెట్టి కొనుగోలు చేసింది. రైతుల వద్ద తక్కువ ధరకు పత్తిని కొని.. దళారులు ఎక్కువ రేటుకు కొని రైతుల పేరిట సీసీఐకి విక్రయించారు. ఒక్కో క్వింటాల్‌కు రూ1,500 నుంచి రూ2,500 వరకు గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా రూ.లక్షలు చేతులు మారినట్లు తెలుస్తోంది. భద్రాచలం, మహారాష్ట్ర నుంచి పత్తిని ఎక్కువగా ప్రత్యేక వాహనాల్లో తీసుకొచ్చి సీసీఐకి విక్రయించినట్లు తెలుస్తోంది. పత్తి విక్రయించగా వచ్చిన డబ్బులకు సంబంధించి ముందుగానే ఆయా రైతుల దగ్గరి నుంచి చెక్కులు, పాస్ బుక్‌లను తీసుకున్నారు. ఇలా సహకరించిన రైతులకు ఒక్కో క్వింటాల్ పత్తి రూ100 చొప్పున కమీషన్ సైతం ఇచ్చినట్లు సమాచారం. అలాగే వ్యవసాయ అధికారికి ఒక్కో టీఆర్‌కు దాదాపు రూ10వేలు ముట్టచెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపిస్తేనే వాస్తవాలు బయటపడే అవకాశాలు ఉన్నాయని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

విచారణ నివేదిక అందజేశాం

టెంపరరీ రిజిస్ట్రేషన్ (టీఆర్) పత్రాలపై విచారణ చేసి కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. ఫోర్జరీ సంతకాలతో టీఆర్‌లు జారీ అయినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– నాగరాజు, మార్కెటింగ్ అధికారి

పత్తి దళారులపై చర్యలేవి...?

విజిలెన్స్ విచారణ జరిపించాలి



హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ కాటన్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన నాలుగు సీసీఐ కేంద్రాల్లో బోగస్ రైతుల పేరున పత్తి విక్రయించిన దళారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లో శనివారం విలేకరులతో మాట్లాడుతూ...బోగస్ టీఆర్‌లను జారీచేసిన మండల వ్యవసాయ అధికారిని సస్పెండ్ చేసిన ప్రభుత్వాధికారులు, వ్యవసాయాధికారితో చేతులు కలిపి రైతుల పేరున సీసీఐలో పత్తి అమ్మిన వ్యాపారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బోగస్ రైతుల పేరున సీసీఐలో విక్రయించి లాభాలు పొందిన వ్యాపారులను గుర్తించి వారి లైసెన్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు



పదిలంగా అల్లిన పొదరిల్లు

ఐక్యతకు చిరునామాగా ఉమ్మడి కుటుంబాలు

- అరమరికలు లేకుండా..అంతా కలిసికట్టుగా
- ఒకే ఇంట్లో ఆప్యాయత, అనురాగాల మధ్య
- ఏళ్ల నాటి నుంచి ఉమ్మడిగానే జీవనం
- కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటూ
- ఆదర్శంగా నిలుస్తున్న పలు కుటుంబాలు

సండే స్పెషల్ — వివరాలు 8లో

ధన వ్యామోహంతో ఆత్మీయత, ప్రేమాభిమానాలు అడుగంటి, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ క్రమేపీ కనుమరుగవుతోంది. మేము మా అందరం అనే భావన నుంచి, నేను నా పిల్లలు అనే సంకుచితభావనలతో ఉమ్మడి కుటుంబాలు చితికిపోయి న్యూక్లియర్ ఫ్యామిలీలు ఏర్పడుతున్నాయి. గతంలో ఏ ఇల్లు చూసినా కుటుంబసభ్యుల పనుల హడావిడి, ఆడపడుచుల ముసిముసినవ్వులు, బావా మరదళ్ల సరదాలు, బుడి బుడి నడకలతో బోసినవ్వులు చిందిస్తూ కనిపించే చిన్నారులు వీరంతా నట్టింటో, వాకిళ్లలోనో నడయాడుతుంటే నిత్యం సందడే. ఇలాంటి సందర్భాలు ఇప్పుడు ఏ పండుగపూటో లేదా సినిమాల్లోనో చూస్తున్నాం తప్పా వాస్తవంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగైపోతున్నాయి. ఇటువంటి నేపథ్యంలో కలసి ఉంటేనే కలదు సుఖం అని తాతల తరం నుంచీ నమ్ముతూ కష్టాసుఖాలను పంచుకుంటూ, ప్రేమానురాగాలు, ఆత్మీయతలను పెంచుకుంటూ ఉమ్మడి కుటుంబాల ఉనికిని కాపాడుతున్నాయి కొన్ని కుటుంబాలు. అంతేనా! పదిలంగా అల్లిన పొదరిల్లు మాది అని నేటి తరానికీ చాటుతున్నాయి. అలాంటి ఉమ్మడి కుటుంబాల గురించి ఆదివారం సాక్షిప్రత్యేక కథనం..

– వర్గల్(గజ్వేల్)/జహీరాబాద్ టౌన్/దుబ్బాక

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి


మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని

సిద్దిపేటరూరల్: ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఉపాధిహామీలో భాగంగా చేపట్టిన పనుల ప్రగతిపై మండలాల వారీగా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి డీఆర్డీఏ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చేపట్టిన సీసీరోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల్లో మరుగుదొడ్లు, డ్రైనేజీలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. పూర్తయిన నిర్మాణాలకు సంబంధించి ఎంబీ రికార్డు చేయాలన్నారు. ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వాటిని వెంటనే ప్రారంభించి వారం రోజుల్లోగా నిర్మాణ ప్రగతిని చూపించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, పంచాయతీరాజ్ ఈఈలు శ్రీనివాస్‌రెడ్డి, చిరంజీవి, డీఈలు, ఆయా మండలాల ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌ప్లాంట్లు ఏర్పాటు చేయండి

సోలార్‌ప్లాంట్ల ఏర్పాటు, యూడీ ఐడీ కార్డుల జారీపై శనివారం సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ కలెక్టర్, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఈఓ అధికారులకు సూచనలు, సలహాలు చేశారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యా, సంక్షేమ శాఖ అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అప్రమత్తం

అదనపు కలెక్టర్ హమీద్


మాట్లాడుతున్న అబ్దుల్ హమీద్

సిద్దిపేటరూరల్: జిల్లాలో డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని అరికట్టాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ పోలీసు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్డు భద్రత కమిటీ, మత్తు పదార్థాల వినియోగ నివారణకు సంబంధించి అధికారులతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ రవాణాపై నిఘా మరింత ముమ్మరం చేయాలన్నారు. సోషల్ మీడియాలో డ్రగ్స్‌పై అవగాహన వీడియోలు, ఫొటోలతో ప్రచారం చేయాలని సూచించారు. అలాగే విద్యాసంస్థలలో సదస్సులు నిర్వహించాలని చెప్పారు. విద్యాసంస్థల వద్ద డ్రాపౌట్ విద్యార్థులు, ఇతరులు డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా డ్రగ్స్ బారిన పడినా, పిల్లల ప్రవర్తనలో తేడా వచ్చినా వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 1908, 8712671111, 08457-14446కు ఫోన్‌చేసి డి-అడిక్షన్ సెంటర్‌కు పంపాలని చెప్పారు.

విద్యా బోధనలో ‘టీఎల్‌ఎం’ కీలకం


మేళాలో ప్రదర్శించిన అంశాలను పరిశీలిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనలో టీఎల్‌ఎం ఎంతో కీలకమని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని పెద్దమ్మగడ్డ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన టీఎల్‌ఎం (టీచర్ లెర్నింగ్ మెటీరియల్) మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మండల పరిధిలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రదర్శించిన పలు అంశాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అందులో భాగంగా టీఎల్‌ఎంను ప్రతి ఉపాధ్యాయుడు ఉపయోగించి విద్యార్థులకు బోధన చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కిష్టయ్య, జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్లు నర్సింహులు, రామస్వామి, రంగనాథ్, భాస్కర్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఐలయ్య, నాగమణి, చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటి తలంబ్రాల దీక్ష అభినందనీయం

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి


తలంబ్రాలను పంపిణీ చేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో భద్రాచల సీతారాముల కోటి తలంబ్రాల దీక్షను ప్రారంభించడం అభినందనీయమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కొనియాడారు. భద్రాచలం సీతారాముల కల్యాణంలో వాడే తలంబ్రాలను భక్తులు గోటితో ఒలిచి తీసుకెళ్లే బాధ్యత స్థానిక రామకోటి భక్త సమాజం నిర్వాహకుడు రామరాజుకు దక్కింది. ఈ దీక్షను శనివారం గజ్వేల్‌లో ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇక్కడనుంచి 250 కిలోల ఒలిచిన తలంబ్రాలను భద్రాచలం పంపించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో భక్తులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, బీజేపీ నాయకులు జశ్వంత్‌రెడ్డి, ఎల్లు రాంరెడ్డి, పేర్ల శ్రీనివాస్, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంటలను కాపాడండి

మంత్రి ఉత్తమ్‌కు హరీశ్ రావు విజ్ఞప్తి

సిద్దిపేటజోన్: నియోజకవర్గ పరిధిలోని పంట పొలాలకు సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని, గోదావరి జలాలను అందించి రైతులను ఆదుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు శనివారం ఫోన్ ద్వారా విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలోని పంట పొలాల పరిస్థితి, మండుతున్న ఎండల నేపథ్యంలో సాగునీరు విడుదల చేయాలని కోరారు. మిడ్ మానేరు ద్వారా రంగనాయ కసాగర్‌లోకి నీటిని పంపింగ్ చేయాలని కోరారు. యాసంగి పంట సీజన్ పూర్తి అయ్యేంత వరకు సాగునీటిని అందించాలన్నారు. సాగునీరు లేక రైతుల పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని గుర్తు చేశారు. యాసంగి పంటకాలం పూర్తి అయ్యేంత వరకు పొలాలకు సాగునీరు అందించాలని కోరారు.

రంజాన్ శుభాకాంక్షలు..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే హరీశ్‌రావు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఉపవాస దీక్షలు, ప్రార్థనలతో సామరస్యం, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని పేర్కొన్నారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లిం సోదరులంతా నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలతో నిష్ఠగా అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగించడం హర్షణీయమన్నారు. అల్లా రక్షణ, కరుణ పొందాలనే లక్ష్యంతో రంజాన్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ ప్రతి ఒక్కరు ఉన్నదానిలో ఎంతో కొంత దానధర్మాలు చేయడం సంతోషదాయకమని పేర్కొన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులు ప్రారంభం

దుబ్బాకటౌన్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం ఆదేశానుసారం దుబ్బాకలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను శనివారం హౌసింగ్ డీఈ శ్రీనివాస్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 లక్షలతో నెల రోజుల్లో మోడల్ హౌస్‌ను పూర్తి చేస్తామన్నారు. దుబ్బాక మున్సిపల్, రూరల్ గ్రామాల ప్రజల అవగాహనకు ఈ మోడల్ హౌస్ నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి నరేందర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ నారాయణ రెడ్డి ఉన్నారు.


పనులను పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాస్

నర్సారెడ్డి తీరుతో కాంగ్రెస్‌కు నష్టం

- ఆయనపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాం
- పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి


మాట్లాడుతున్న నాయిని యాదగిరి

గజ్వేల్: డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి తీరుతో గజ్వేల్ కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టం వాటిల్లుతోందని, ఆయన వైఖరిపై కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేస్తామని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి అన్నారు. శనివారం గజ్వేల్, ములుగు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి, శ్రీనివాస్‌గుప్తతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకొని ఉన్న నాయకులను వదిలేసి, కాంగ్రెస్‌లో కొత్తగా చేరిన నేతలకు నర్సారెడ్డి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో డీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తామంటే తాము అండగా నిలిచిన విషయం మరిచిపోవద్దన్నారు. నర్సారెడ్డి పార్టీకి నష్టం చేస్తున్న విధానాలను నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

దుబ్బాకటౌన్: నిబంధనలు పాటించని క్లీనిక్‌లు, మెడికల్ షాపుల యజమానులపై కఠిన చర్యలు తప్పవని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వినయ్ సుష్మి హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాయపోల్ మండలం బేగంపేటలో మారుతి క్లీనిక్, మెడికల్ షాప్‌పై దాడులు నిర్వహించారు. సరైన విద్యార్హత లేకుండా క్లీనిక్ నిర్వహిస్తున్న రామాంజనేయులుపై చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులేని మెడికల్ షాప్‌ను సీజ్ చేసి రూ.30వేలు విలువ గల 14 రకాల మందులను స్వాధీనం చేశామన్నారు.

క్లుప్తంగా

చెట్టును ఢీట్టిన కారు

– ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

బెజ్జంకి(సిద్దిపేట): కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ఘటన మండలంలోని తోటపల్లి శివారులోని రాజీవ్ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. కరీంనగర్‌కు చెందిన శ్రీనివాస్, కిరణ్ హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వస్తుండగా ప్రమాదం జరిగింది. కారులోని ఇద్దరికి గాయాలు కాగా స్థానికులు బయటకు తీసి 108 అంబులెన్సులో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియరాలేదు.

బైక్‌కు నిప్పు

దుబ్బాకటౌన్: ఇంటి బయట నిలిపిన బైక్‌కు గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. ఈ ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో చోటు చేసుకుంది. శనివారం దుబ్బాక ఎస్ఐ గంగరాజు కథనం మేరకు.. లచ్చపేటకు చెందిన కోదారి నరేశ్ రోజూ మాదిరిగానే ఇంటి బయట బైక్‌ను ఉంచాడు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు బైక్‌కి నిప్పంటించి పరారయ్యారు. మూత్ర విసర్జన కోసం నిద్రలేచిన నరేశ్ బయట దగ్ధమవుతున్న బైక్‌ని చూసి మంటలార్పే ప్రయత్నం చేశాడు. అప్పటికే బైక్ కాలిపోయింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్కూలు బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి

గజ్వేల్‌రూరల్: నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలిని స్కూలు బస్సు ఢీకొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటన గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మద్దూరు మండలం సలాక్‌పూర్‌కు చెందిన తరిగొప్పుల లచ్చవ్వ(65) నెల కిందట గజ్వేల్‌కు వచ్చి చిన్న కుమారుడు వద్ద ఉంటుంది. శనివారం పట్టణంలోని ఢిల్లీవాల హోటల్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న లచ్చవ్వను వెనుక నుంచి వచ్చిన బ్రిలియంట్ గ్రామర్ స్కూల్‌కు చెందిన బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

వివాహిత సంబంధమే కారణమా!

అక్కన్నపేట(హుస్నాబాద్): పోలీస్ స్టేషన్ ఎదుట ఓ యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన అక్కన్నపేట మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్ భాస్కర్ కథనం మేరకు.. మండలంలోని సేవాలాల్ మహారాజ్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని బంగారు లొద్దితండాకు చెందిన ధరావత్ సంపత్ బతుకుదెరువు నిమిత్తం లారీ డ్రైవర్‌గా కరీంనగర్‌లో పనిచేస్తూ జీవిస్తున్నారు. ఇతడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కొద్ది రోజులుగా భార్యతో గొడవ పడి మూడేళ్లుగా ఒంటరిగానే ఉంటున్నాడు. అదే తండాకు చెందిన ఓ మహిళతో సంపత్ వివాహిత సంబంధం కొనసాగిస్తున్నాడు. ఇంతలోనే నేను వద్దన్నా నా వెంట పడుతున్నాడూ వేధిస్తున్నాడని సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఆ యువకుడు పోలీస్ స్టేషన్ ఎదుటే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయమై కూడా యువకుడిపై మరో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు.

పదిలంగా అల్లిన పొదరిల్లు

ఐక్యతకు కేరాఫ్ అడ్రస్‌గా ఉమ్మడి ఫ్యామిలీలు


చంద్రమ్మ 90వ బర్త్‌డే సందర్భంగా కుటుంబ సభ్యుల వేడుక

జంబో ఫ్యామిలీ.. అంతా కలివిడి

● ఆదర్శంగా 90 ఏళ్ల వేలూరి చంద్రమ్మ ఖాన్‌దాన్


చంద్రమ్మ

వర్గల్(గజ్వేల్) : వర్గల్ మండల కేంద్రానికి చెందిన 90 ఏళ్ల 'వేలూరి చంద్రమ్మ' ఖాందాన్ ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో జీవన మాధుర్యానికి ప్రతీకగా నిలుస్తుంది. తొంభయ్యో దశకంలో అడుగిడిన వేలూరి చంద్రమ్మది వ్యవసాయ నేపథ్యం కలిగిన కుటుంబం. ఆమె భర్త బాల్‌రెడ్డి 2010లో మృతి చెందారు. వీరికి బాల్‌రెడ్డి, శంభారెడ్డి, కిష్టారెడ్డి, రామచంద్రారెడ్డి నలుగురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అంతా కలివిడిగా ఉన్న ఈ కుటుంబంలో అందరూ 'కష్టే ఫలి' అన్నట్లు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యేవారు. కొడుకులకు, కూతుర్లకు వివాహాలతో కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగింది. ఆ తర్వాత మనవల వివాహాలు, మునిమనవళ్ల, మునిమనవరాళ్లతో చంద్రమ్మ ఖాందాన్ జంబో ఫ్యామిలీగా రూపాంతరం చెందింది. కుటుంబ సభ్యుల సంఖ్య 33కు చేరింది. కూతుళ్లతో సంఖ్య వీటికి అదనం. కాలానుగుణ మార్పుల నేపథ్యంలో వ్యవసాయంతోపాటు, వ్యాపారాలు, వ్యవహారాల కారణంగా ఉమ్మడి కుటుంబమైనప్పటికీ గృహ వసతి సరిపోక వేర్వేరుగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఇటీవల జనవరి 19న చంద్రమ్మ 90వ పుట్టిన రోజు వేడుకను కొడుకుల నుంచి మనవళ్లు, మునిమనవళ్లు, మనవరాళ్ల దాకా అంతా కలిసి ఘనంగా జరిపించారు.

కష్టం తెలిసేది కాదు



70 సంవత్సరాల జీవన గమనంలో ఉమ్మడి కుటుంబాల మాధుర్యం అనుభవించా. పెద్దల మాటలు గౌరవిస్తూ రోజంతా పొలం పనుల్లో చెమటోడ్చేలా శ్రమించేవాళ్లం. సద్దిబువ్వ, ఆత్మీయత, ప్రేమలు, కుటుంబ సభ్యుల మధ్య కష్టాలు మరిచిపోయేటోళ్లం. వ్యవహారాలు, సౌకర్యాల పరంగా మా కుటుంబాలు వేరుగా ఉంటున్నప్పటికీ పండుగలు, పబ్బాలు కలిసి మెలిసి జరుపుకుంటాం.

– వేలూరి బాల్‌రెడ్డి, చంద్రమ్మ పెద్ద కుమారుడు

నందనవనంలా.. ఆదర్శవంతంగా

● తొమ్మిది దశాబ్దాలుగా కలిసి ఉంటున్న బాల్‌రెడ్డి కుటుంబం

వర్గల్(గజ్వేల్) : చిన్న చిన్న తగాదాలు, మాట పట్టింపులు, ఆస్తి గొడవలు, డబ్బు కోసం వెంపర్లాటతో కుటుంబ వ్యవస్థలు చిక్కిశల్యమవుతున్న వేళ వర్గల్ మండలం నెంటూరులోని నిమ్మ బాల్‌రెడ్డి(85) కుటుంబం ఉమ్మడి కుటుంబానికి నిర్వచనంగా నిలుస్తుంది. ఆత్మీయత అనురాగాలకు ప్రతీకగా కలిసి ఉంటే కలదు సుఖమని చాటుతూ సమైక్య జీవన సౌందర్యంతో ఆదర్శవంతంగా నిలుస్తోంది. నాటి కాలంలో హెచ్ఎస్‌సీ చదివిన నిమ్మ బాల్‌రెడ్డి ఉద్యోగానికి బదులు రైతుగా వ్యవసాయానికే ప్రాధాన్యత ఇచ్చారు. భార్య బాలమణి 2018లో మరణించారు. ఇతడికి రంగారెడ్డి, పెంటారెడ్డి ఇద్దరు కుమారులున్నారు. పాడి పంటకు భరోసాగా దొడ్డి నిండా ఆవులు, గేదెలు, ఎద్దులుండేవి. కుమారుల వివాహాలు జరిపించారు. కొడుకులు, కోడళ్లు, మనవళ్లు, మనవరాళ్లతో కుటుంబ సభ్యుల సంఖ్య 9కి పెరిగింది. తొమ్మిది దశాబ్దాల నుంచి వేర్వేరు భావనకు తావీయకుండా వారందరూ ఉమ్మడి కుటుంబంగా ఒకే ఇంట్లో నివసిస్తూ, ఒకే ఇంట్లో వంటలు, భోజనాలతో ఆదర్శంగా నిలుస్తున్నారు. షాపింగ్, ఫంక్షన్లు, పండుగలు ఏదైనా అంతా కలిసే చేస్తారు. ఇద్దరు సోదరులు పొరపొచ్చాలకు తావు లేకుండా ఉమ్మడి కుటుంబాన్ని ముందుకు నడిపిస్తున్నారు.


వర్గల్ మండలం నెంటూరులో బాల్‌రెడ్డి ఉమ్మడి కుటుంబం

ఉనికి కోల్పోతున్నాయి



ఉమ్మడి కుటుంబం విలువలతో ముడిపడి ఉంటుంది. బంధాలను, ఆత్మీయతలను చాటుతుంది. కష్టసుఖాలు అందరూ పంచుకోవడం ద్వారా ఆనందమయ జీవనానికి బాటలు వేస్తుంది. ఇప్పుడు పెద్దల మాటకు పట్టింపులేకుండా పోతుంది. తగాదాలు, విభేదాలతో ఉమ్మడి కుటుంబాలు ఉనికి కోల్పోతున్నాయి. దీంతో చిన్న కుటుంబాలుగా విడిపోతున్నాయి. పిల్లలకు బంధుత్వాలు, విలువలు, ఆత్మీయత తెలియజెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

– నిమ్మ బాల్‌రెడ్డి, నెంటూరు

ఒకే ఇల్లు.. ఒకటే వ్యాపారం

● దుబ్బాక పట్టణంలో చింతలేని కుటుంబం

దుబ్బాక : దుబ్బాక పట్టణంలోని వైశ్యకులానికి చెందిన చింత గంగాధరం, విజయ దంపతులకు యమునాకర్, శ్రీనివాస్, సంతోష్ ముగ్గురు కుమారులు, ఓ కూతురు స్వప్న ఉన్నారు. గంగాధర్ 2008లో చనిపోగా తల్లి విజయతో కలిసి ముగ్గురు కుమారులు భార్యా పిల్లలతో హాయిగా ఒకే ఇంట్లో కలిసి మెలిసి ఉంటున్నారు. చెల్లెలు స్వప్నకు పెండ్లి అయినా ప్రతీ పండుగ శుభకార్యాలకు భర్త, పిల్లలతో కలిసి ఇంటికొచ్చి అందరితో సంతోషంగా ఉంటుండడం విశేషం. సుమారుగా 50 ఏళ్లుగా అంతా కలిసి ఉమ్మడి కుటుంబంగా ఉంటున్నారు.


దుబ్బాక పట్టణంలోని చింత విజయ గంగాధరం ఉమ్మడి కుటుంబం

తల్లితో కలిసి 12 మంది

ఐక్యమత్యంగా ఉంటే సాధించలేనిది ఏం లేదన్న నానుడి పట్టణంలోని చింత ఫ్యామిలీకి దక్కుతుంది. తల్లి, ముగ్గురు కుమారులు వారి భార్య,పిల్లలతో కలిసి మొత్తం 12 మంది ఉమ్మడి కుటుంబంగా ఉంటూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ముగ్గురు అన్నాదమ్ముళ్లు కలిసి హరిహర రెడిమెడ్ డ్రెస్సెస్ పేరిట బట్టల దుకాణం నడుపుతున్నారు. పాత ఇల్లును కూల్చి ఇటీవలె కొత్త భవనం నిర్మించుకున్నారు. ఇంట్లో మనమందరం ఒకటే అనే భావనతో కలిసి పెద్ద కుటుంబంగా హాయిగా ఉంటున్నారు.

ఎప్పటికీ విడిపోం..



అందరూ కలిసి ఉండాలని అమ్మానాన్నలు మాకు చిన్నప్పటి నుంచి చెబుతుంటారు. నేను అన్నా, తమ్ముడు, చెల్లెలు మా పిల్లలతో కలిసి ఇప్పటికి ఉమ్మడి కుటుంబంగానే ఉంటున్నాం. ఎప్పటికీ మేము విడిపోం కలిసే ఉంటాం. నేను నా ఫ్యామిలీ అనుకోం అంతా మన ఫ్యామిలియే అంటూ పెళ్లీలు, శుభకార్యాలు అన్ని కలిసి కట్టుగానే నిర్వహించుకుంటాం. ఈ రోజుల్లో అందరూ కలిసి ఉంటున్నారని మా బంధువులు, స్నేహితులు మాట్లాడుతుంటే సంతోషంగా ఉంటుంది.

– చింత శ్రీనివాస్


పాట్‌పల్లి రాంచంద్రయ్య కుటుంబ సభ్యులు

60 ఏళ్లుగా కలిసి ఉంటూ..

పాట్‌పల్లి రాంచంద్రయ్య ఉమ్మడి కుటుంబం

జహీరాబాద్ టౌన్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలోని పాట్‌పల్లి రాంచంద్రయ్య ఉమ్మడి కుటుంబం ఐక్యతకు ప్రేరణగా నిలుస్తుంది. పాట్‌పల్లి రాంచంద్రయ్య ఉపాధ్యాయుడిగా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు భార్య పార్వతమ్మ, కుమారులు వెంకటేశం, నర్సింలు, శ్రీనివాస్, అనిల్ కుమార్, సంగమేశ్వర్‌తో పాటు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. 60 ఏళ్లుగా అందరూ కలిసే ఉంటున్నారు. కుటుంబంలో 46 మంది ఉండగా కాలక్రమేణా నిరంతరం పెరుగుతుంది.

పంచ పాండవులు ఒకే చోట

ఈ ఉమ్మడి కుటుంబం ప్రధాన వృత్తి వ్యాపారం. ఐదుగురు కుమారుల్లో నలుగురు జహీరాబాద్ పట్టణంలో వేర్వేరుగా వ్యాపారాలు చేస్తుండగా ఒకరు అమెరికాలో స్థిరపడ్డారు. పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో ఉన్న మూడస్తుల ఇంటిలో అందరూ ఒకే చోట కలిసి ఉంటారు. కోడళ్లు అంతా గృహిణీలు కావడంతో అత్త పార్వతమ్మ సూచనల మేరకు ప్రతి రోజూ పనులు, వంటలు చేస్తుంటారు. కుటుంబ అధిపతి అయిన రాంచంద్రయ్య వయసు మీద పడటంతో ఆయన కుమారుడు శ్రీనివాస్ కుటుంబ వ్యవహారాలను చూసుకుంటారు. పండుగలు, శుభకార్యాలప్పుడు కోడళ్లంతా కలిసి కుటుంబ సభ్యులకు, బట్టలు కొంటారు. కుటుంబ సభ్యుల సంఖ్య పెరుగుతుండటంతో ఇప్పుడున్న ఇల్లు సరిపోక కొత్తగా మరో ఇంటిని కట్టుకుంటున్నారు.

లాభాలే ఎక్కువ



ఉమ్మడి కుటుంబంలో సుఖ, సంతోషాలను ఇతరులతో పంచుకోవచ్చు. ప్రతీ ఒక్కరికి ఆర్థిక మద్దతు లభిస్తుంది. స్త్రీలకు గౌరవం దక్కుతుంది. పెద్దల సలహాలు లభిస్తాయి. నెల ఖర్చులు బాగా తగ్గుతాయి. బాధల్లో ఉన్న ఓదార్పు దొరుకుతుంది. ప్రతి రోజూ ఆనందం ఉంటుంది. ఉమ్మడి కుటుంబాలతో లాభాలే ఎక్కువ

– పాట్‌పల్లి శ్రీనివాస్, జహీరాబాద్

విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

కొడిపల్లి(నర్సాపూర్) : విద్యార్థులు మంచి వ్యాపారవేత్తలుగా ఎదగాల్సిన అవసరం ఉందని విజ్ఞాన జ్యోతి విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి కోడె దుర్గా ప్రసాద్ అన్నారు. శనివారం సాయత్రం కొడిపల్లి మండలం తునికి వద్దగల డాక్టర్ డి.రామానాయుడు విజ్ఞాన జ్యోతి వ్యవసాయ కళాశాలలో 21వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు నెలల వ్యవసాయ విద్య పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ విద్య నేర్చుకున్న విద్యార్థులు మంచి వ్యాపార వేత్తలుగా ఎదగాలని సూచించారు. వ్యాపారం ప్రారంభించే విద్యార్థులకు విజ్ఞాన జ్యోతి తరపున రూ.2.50 లక్షలు అందజేస్తామన్నారు. దీంతోపాటు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ రంగాల్లో అధిక దిగుబడి సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. చైర్మన్ అచ్యుతరామ్ మాట్లాడుతూ.. మానవ మనుగడ వ్యవసాయంపై ఆధారపడి ఉందని ప్రతీ ఒక్కరికి ఆహారం అవసరం కాబట్టి వ్యవసాయ ఉత్పత్తులను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం పలు క్రీడ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. కార్యక్రమంలో పీఎం క్లాస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధి గోగాయి, డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, నూజివీడు సీడ్స్ ప్రతినిధి శ్రీనివాస్‌రావు, ఫీడ్ కో ఆర్డినేటర్ జగదీశ్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లతో విద్యార్థులు, తదితరులు

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

సిద్దిపేటకమాన్: వాటర్ సంపులో మహిళ మృతదేహం లభ్యమైన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. సిద్దిపేట ఓల్డ్ కేసీఆర్ నగర్ ప్రాంతంలో మేర సంఘం సభ్యులు తమ కుల సంఘం భవనం వద్దకు శుక్రవారం సాయంత్రం వెళ్లారు. ఆ ప్రాంతంలో దుర్వాసన రావడంతో ఓ ఇంటి వద్ద నీటి సంపు పైన ఉన్న మూత తీసి చూడగా కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి నీటి సంపు నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం కుడిచేతి పైన 'ఎం' అనే టాటూ ఉన్నట్లు గుర్తించారు. సుమారు 15 రోజుల కిందటే మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కూలీ పనులు చేసుకునే ఇతర రాష్ట్రానికి చెందిన మహిళగా స్థానికులు చర్చించుకుంటున్నారు. మొహం గుర్తు పట్టలేని విధంగా ఉండడంతో గుర్తు తెలియని మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

సాకి చెరువులో మరో మహిళ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వయసు 45 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని మెడలో తాళిబొట్టు, తాయత్తు ఉండటాన్ని గుర్తించారు. మృతురాలికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతరకొచ్చి ఇద్దరు యువకులు మృతి

- మంజీరాలో ఈతకెళ్లి గల్లంతు
- ఒకరిని కాపాడబోయి మరొకరు మునక
- గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలు వెలికితీత
- పోతంశెట్టిపల్లి రెండవ బ్రిడ్జి వద్ద ఘటన


శ్యామ్(ఫైల్)


కృష్ణ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): ఏడుపాయల వన దుర్గాదేవి జాతరకొచ్చి ఇద్దరు యువకులు నీటిలో మునిగి మృతి చెందారు. ఈ ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. హైదరాబాద్ ఇందిరా నగర్ కాలనీకి చెందిన నిన్నేకర్ కృష్ణ(18) బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఆసిఫ్ నగర్‌కు చెందిన మిల్కికర్ శ్యామ్(21) ఇటీవలె డిగ్రీ పూర్తి చేశాడు. ఇరు కుటుంబాలు కలిసి గురువారం ఏడుపాయల వన దుర్గాదేవి జాతరకు వచ్చారు. అమ్మవారిని దర్శించుకొని మూడు రోజులపాటు ఉత్సాహంగా గడిపారు. ఇందులో ఇద్దరు యువకులు శనివారం ఈత కోసం ఏడుపాయల నుంచి వచ్చి పోతంశెట్టిపల్లి రెండవ బ్రిడ్జి వద్ద మంజీరా నదిలోకి దిగారు. ఇద్దరూ ఈత కొడుతున్న క్రమంలో ఆయాసం వచ్చి కృష్ణ నీట మునిగాడు. ఇది గమనించిన శ్యామ్ కృష్ణను కాపాడే ప్రయత్నంలో అతనూ నీట మునిగిపోయాడు. బ్రిడ్జి పై నుంచి ఇది గమనించిన కృష్ణ సోదరుడు అంబదాస్ ఇద్దరినీ కాపాడేందుకు నదికిలోకి దిగాడు. అప్పటికే వారు కనిపించకుండా పోయారు. వెంటనే గజఈతగాళ్ల సాయంతో వెతికించగా ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. అప్పటిదాకా సంతోషంగా గడిపిన ఇరు కుటుంబాల్లో తీరని శోకం నిండింది. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

–198 గ్రాములు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఎస్ఐ నీరేశ్‌తో కలిసి సీఐ శ్రీను వివరాలు వెల్లడించారు. పట్టణ కేంద్రానికి చెందిన నీలం చందు, జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన ఏనుగుల బాబు, మహంకాళి రాజేశ్ స్థానిక వ్యవసాయ మార్కెట్ వెనుకాల గంజాయి విక్రయిస్తూ తాగుతున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు సిద్దిపేట టాస్క్ ఫోర్స్, చేర్యాల పోలీసులు వెళ్లి రైడ్ చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 198 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారించగా హైదరాబాద్ ధూల్‌పేట్ గుర్తు తెలియని వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొహిబిషనరీ ఎస్ఐ మానస రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని హనుమాన్ వీధిలో నివాసముండే చిగుల్లపల్లి యాదగిరి(62)కి భార్యతోపాటు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పిల్లలందరి వివాహం కాగా యాదగిరి కిరాణ దుకాణంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యాడు. ఆర్థిక ఇబ్బందులతో కొంత కాలంగా మనోవేదనకు గురవుతూ శనివారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

అప్పుల బాధతో యువకుడు

వట్‌పల్లి(అందోల్): అప్పుల బాధతో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం అందోలు గ్రామంలో చోటు చేసుకుంది. జోగిపేట ఎస్ఐ పాండు కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుంటి నాని(25) కోళ్లఫామ్ లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు పిల్లలు ఉండగా అనారోగ్యానికి గురి అవడంతో ఏడాది కిందట రూ.రెండు లక్షల వరకు అప్పులు చేశాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం గ్రామ శివారులోని ఓ రైతు పొలంలో చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. అప్పుల బాధతోనే భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య మహేశ్వరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్

చేర్యాల(సిద్దిపేట): స్థానిక పెద్దమ్మగడ్డ హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డా.దీపాంజలి ఆల్‌ఇన్‌వన్ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి 10 జీపీఏ సాధించాలన్నారు. ఎంఈఓ రచ్చ కిష్టయ్య, లయన్స్ క్లబ్ ప్రతినిధి కొండయ్య, స్థానిక నాయకుడు తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో లయన్స్ క్లబ్ దీపాంజలి

◆ **దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు**

సిద్దిపేటకమాన్: విధి నిర్వహణలో ఉన్న హోంగార్డుపై దురుసుగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయంలో హోం గార్డుగా విధులు నిర్వహిస్తున్న రామేశ్వర్‌పై శనివారం కరుణాకర్‌రెడ్డి అనే వ్యక్తి కార్యాలయ కౌంటర్ వద్ద దురుసుగా ప్రవర్తించాడు. దీంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కరుణాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

◆ **యువతపైనే దేశ భవిష్యత్**

సిద్దిపేటజోన్: దేశ భవిష్యత్ యువత పైనే ఆధారపడి ఉందని ఏబీవీపీ నాయకులు విష్ణువర్ధన్ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ఖేల్ భారత్ క్రీడోత్సవ్ 2025 పేరిట నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు శనివారం స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత సెల్‌ఫోన్‌లను విడిచి క్రీడల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సూర్యప్రకాశ్‌రావు, ఏబీవీపీ ప్రతినిధులు లక్ష్మణ్, ఆదిత్య, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించాలి**

గజ్వేల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన పనులను శనివారం ఆయన పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణలో సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.

◆ **పంట నమోదు చేయించుకోండి**

అక్కన్నపేట(హుస్నాబాద్): యాసంగి సీజన్‌ల్లో రైతులు సాగుచేసిన పంటలను నమోదు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి రాధ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడోతేదీ లోపు పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంట నమోదుకు చివరి అవకాశామని, గతంలో ఏఈఓలు పంట ధ్రువీకరణ పత్రాలు ఇస్తే కొనుగోలు చేశారని, కానీ ఈ సీజన్ నుంచి ఆ వెసులుబాటు తీసివేస్తారని తెలిపారు. ఆన్‌లైన్‌లో పంట నమోదు లేకపోతే మార్కెట్‌లో అమ్మినప్పుడు రైతులు ఇబ్బందులకు గురవుతారని, తప్పకుండా రైతులంతా పంట నమోదు చేయించుకోవాలని కోరారు.

◆ **సమాజంలో విద్యతోనే గుర్తింపు**

హుస్నాబాద్: సమాజంలో విద్యతోనే గుర్తింపు వస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. శనివారం నిర్వహించిన నవ భారత్ హైస్కూల్ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులంతా ఉన్నత చదువులతో ఈ ప్రాంతానికి మంచి పేరు తేవాలన్నారు. ఎంఈఓ మనీల, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, కరస్పాండెంట్ రవి పాల్గొన్నారు.

◆ **హరీశ్‌రావుపై తప్పుడు కేసులను సహించం**

గజ్వేల్: మాజీ మంత్రి హరీశ్‌రావుపై అక్రమ కేసులను సహించబోమని రైతుబంధు సమితి మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్ హెచ్చరించారు. గజ్వేల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు రమేశ్‌గౌడ్, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నేడు తాగునీటికి అంతరాయం**

సిద్దిపేటజోన్: లోయర్ మానేరు డ్యామ్ పైపులైన్ మరమ్మతుల వల్ల ఆదివారం పట్టణంలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దకోడూరు శివార్లలో అత్యవసర మరమ్మతుల పనులు చేపట్టాల్సి ఉందని, ఈ నేపథ్యంలో పట్టణంలోని 18, 19, 20, 21వ వార్డుల్లో తాగునీరు సరఫరా ఉండదని తెలిపారు.

◆ **రఘు మీడియామిని విడుదల చేయాలి**

– పౌర హక్కుల సంఘం నేతలు

సిద్దిపేటకమాన్: మూలవాసి బచావో మంచ్ నేత రఘు మీడియామిని వెంటనే విడుదల చేయాలని సీఎల్‌సీ నేతలు లక్ష్మణ్, నారాయణరావు డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రఘుమీడియాని గత 27న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో అక్రమంగా అరెస్టు చేయడాన్ని పౌరహక్కుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వెంటనే అతడిని విడుదల చేయాలని కోరారు.

◆ **ఉత్సాహంగా సైన్స్ దినోత్సవం**

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు తమలోని నైపుణ్యాన్ని చాటుతూ నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనితా అబ్రహం సూచించారు. కళాశాలలో శనివారం సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయం ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. అధ్యాపకులు శ్రీలత, ఉమారాణి, లక్ష్మి, సరోజ, సునీత, శ్రీలత, శృతి తదితరులు పాల్గొన్నారు.

◆ **మల్లన్నను సస్పెండ్ చేయడం దారుణం**

బెజ్జంకి(సిద్దిపేట): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడం దారుణమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బొనగం రాజేశంగౌడ్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు.

◆ **'నేటి యుద్ధభేరి' పోస్టర్ ఆవిష్కరణ**

సిద్దిపేటఅర్బన్: ఏకీకృత పెన్షన్ పథకం(యూపీఎస్) విధానానికి వ్యతిరేకంగా ఆదివారం హైదరాబాద్ ధర్నాచౌక్ వద్ద నిర్వహిస్తున్న యూపీఎస్‌పై యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురాకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేట అర్బన్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం యూపీఎస్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.